
సాక్షి ఒడిశా

గురువారం । 25 । మే । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలక వర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,17,223లు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



మిరావళిలో క్రికెట్ టోర్నీ ప్రారంభం

- 8లో



పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- 8లో

న్యూస్‌రీల్

పాలిథిన్ నిషేధంపై చైతన్య ర్యాలీ



చైతన్య ర్యాలీలో పాల్గొన్న అధికారులు

రాయగడ: పర్యావరణ కాలుష్యానికి కారణమవుతున్న పాలిథిన్ నిషేధంపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు జిల్లాలోని గుడారి అటవీశాఖ బుధవారం చైతన్య ర్యాలీ నిర్వహించింది. గుడారి అటవీశాఖ అధికారి గంగాధర మిశ్రొ, తహసీల్దార్ భారతీదేవి, అదనపు తహసీల్దార్ హృషీకేష్ పండా, ఎన్‌ఏసీ కార్యనిర్వాహక అధికారి మురళీకృష్ణ పండా తదితరులు పాల్గొన్నారు. ముందుగా తహసీల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ.. ప్రధాన వీధుల మీదుగా కొనసాగింది. పాలిథిన్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. గుడారి ఎన్‌ఏసీని పాలిథిన్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అంతా సహకరించాలని తహసీల్దార్ భారతి పిలుపునిచ్చారు.

పాముకాటుతో మహిళ మృతి



ఆస్పత్రిలో యశోద మృతదేహం

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి మునిసిగా పంచాయతీ బొడొచెకోని గ్రామానికి చెందిన మహిళ యశోద నాయక్(54) పాముకాటుతో మృతిచెందింది. మంగళవారం రాత్రి భోజనం చేసి ఇంటి ఆరుబయట సేద తీరుతున్న సమయంలో కాలిపై విషసర్పం కాటు వేసింది. ఆమె కేకలో వేయడంతో గమనించిన గ్రామస్తులు.. కాసీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

పర్లాకిమిడి: పట్టణంలోని సుభాష్‌నగర్‌లో నిర్వహిస్తున్న జూదం అడ్డాపై ఆదర్శ పోలీసు స్టేషన్ అధికారులు బుధవారం దాడులు చేపట్టారు. ఈ మేరకు ఐదుగురిని అరెస్ట్ చేసి, కోర్టుకు తరలించారు. వీరిలో బినోద్ శ్రీరామ్(45), ప్రమోద్‌కుమార్ స్వాయిని(32), రామచంద్ర ప్రధాన్(33), రమేష్ ప్రధాన్(33), మనోజ్ రైతా(25) ఉన్నారని ఐఐసీ బబులీ నాయక్ తెలిపారు. నిందితుల నుంచి నుంచి రూ.17,870ల నగదు, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

నగరంలో దారుణ హత్య

భువనేశ్వర్: స్థానిక నగరంలో బుధవారం తెల్లవారుజామున దారుణ హత్య చోటు చేసుకుంది. ఒకటో నంబర్ అంగడి సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎం ఎదురుగా యువకుడిని కత్తితో పొడిచి హత్య చేశారు. దీనిపై క్యాపిటల్ థాణా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. సుశాంత్ నాయక్ అనే యువకుడు బైక్‌పై వస్తుండగా వెనుక నుంచి వచ్చిన దుండగులు దాడి చేశారు. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. మరోవైపు హత్య సమాచారం అందుకున్న క్యాపిటల్ థాణా పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. సైంటిఫిక్ టీం సహాయంతో కేసు దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు. హత్యకు ప్రేరేపించిన కారణాలు ఇంకా తెలియరాలేదు. పోలీసుల విచారణ తర్వాతే అసలు నిజం బయటపడుతుందని స్థానికులు భావిస్తున్నారు.

360 కిలోల గంజాయి పట్టివేత

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి మీదుగా ఉత్తరప్రదేశ్‌కు తరలిస్తున్న 360 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చసుకున్నారు. దీనికి సంబంధించి ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. దీనిపై మల్కన్‌గిరి ఐఐసి రీగాన్ కీండో తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ లోని ఆగ్రాకు చెందిన విక్కీ సింగ్(36), ముఖేష్‌కుమార్(32) కలిసి స్థానికంగా నివస్తున్న దుల్లా మాఢి(27) సాయంతో గంజాయి కొనుగోలు చేసి, గుట్టుగా తరలించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ నేపథ్యంలో చిత్రకొండలో 12 బస్తాల్లో 360కిలోల గంజాయి కొనుగోలు చేశారు. వాటిని ఇంద్రజీత్ మాఢి(28), మర మాఢీ(25), దూల్ల మాఢి వేర్వేరు బైక్‌లపై మల్కన్‌గిరి వైపు తరలిస్తున్నారు. అయితే వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులను చూసి, పారిపోయే ప్రయత్నం చేయడంతో అనుమానం వచ్చిన సిబ్బంది.. వారిని అడ్డుకొని తనిఖీ చేశారు. ఈ మేరకు పట్టుబడిన గంజాయిని సీజ్ చేసి, నిందితులను అరెస్ట్ చేశారు. ఐదుగురిని బుధవారం సాయంత్రం కోర్టులో హాజరు పరిచారు. నిందితుల నుంచి రూ.లక్ష 60వేల నగదు, 4 సెల్‌ఫోన్స్, బైక్‌ను స్వాధీం చేసుకున్నారు. పట్టుబడిన సరుకు విలువ రూ.30 లక్షలు ఉంటుందని ఐఐసీ వివరంచారు.

డెంగీ.. డేంజర్ బెల్స్!

- బరంపురంలో విస్తరిస్తున్న కేసులు
- వ్యాధి లక్షణాలతో ఎంకేసీజీలో 46మంది చేరిక
- భారీ వర్షాలు, అపరిశుభ్ర వాతావరణమే కారణమంటున్న బాధితులు





బరంపురం ఎంకేసీజీ డెంగీ వార్డులో చికిత్స పొందుతున్న వ్యాధిగ్రస్తులు

బరంపురం: నగరంలో గత ఏడాది రికార్డు స్థాయిలో విజృంభించిన డెంగీ.. మళ్లీ పంజా విసురుతోంది. గత కొద్ది రోజులుగా నగరంలోని వివిధ వార్డులు, వీధుల్లో వ్యాధిగ్రస్తుల కేసులు విపరీతంగా నమోదవుతున్నాయి. ఈ మేరకు బాధితులను బరంపురం ఎంకేసీజీ మెడికల్ కళాశాల ఆస్పత్రిలో చేర్పించి, చికిత్సలు అందిస్తున్నారు. 2రోజుల క్రితం అంకులికి చెందిన ఓ మహిళ తీవ్ర జ్వరంతో బాధపడుతూ ఎంకేసీజీలో చేరారు. ఆమె రక్త నమూనాలు మైక్రో బయాలజీ కేంద్రానికి పంపగా.. డెంగీగా నిర్ధారణ జరిగిందని జిల్లా మలేరియా అధికారి ఉమాశంకర్ మిశ్రా తెలిపారు. ఇదే విధంగా గత కొద్ది రోజులుగా జ్వోరం, తలనొప్పి, కాళ్లు, చేతుల పీకులు తదితర లక్షణాలతో దాదాపు 46మంది ఎంకేసీజీలో భర్తీ అయ్యారు. వీరంతా డెంగీ వార్డులో చికిత్స పొందడం గమనార్హం. వీరిలో పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ లోని ఇచ్ఛాపురం సమీపం డొంకురు గ్రామానికి చెందిన వ్యక్తులు కూడా ఉన్నట్లు వైద్యులు తెలపడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

వ్యాపిస్తున్న దోమలు..

బరంపురం మున్సిపల్ కార్పొరేషన్ పాలనా యంత్రాంగం నిర్లక్ష్యంతో నగరంలో డెంగీ వ్యాధి విపరీతంగా విజృంభిస్తోంది. నగరంలోని కాలువల్లో పూడికలు తొలగించక పోవడం, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఎక్కడ చూసిన మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. దుర్గంధంతో పాటు ఈ నీటి నిల్వతో దోమలు వ్యాప్తి చెంది, ప్రజలపై దాడి చేస్తున్నాయి. వీటిని అరికట్టడంలో జిల్లా ఆరోగ్యశాఖ, పాలనా యంత్రాంగ వైఫల్యం కనిపిస్తోంది. దీనికి తోడు మెయిన్ రోడ్డుపై చెత్త కుప్పలుగా దర్శనమివ్వడంతో ఇతర వ్యాధులు సైతం సంక్రమించే ప్రమాదం పొంచి ఉంది.

చేతల్లో చూపాలి..

అంటు రోగాలు వ్యాపిస్తున్న సమయంలో ఆలస్యంగా మేల్కొని, హడావిడి చేయడం స్థానిక అధికార యంత్రాంగానికి ఆనవాయితీగా మారింది. దోమల నిర్మూలన, వ్యాధుల నివారణలో చిత్తశుద్ధి, కార్యదీక్ష కొరవడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, నగరంలో విజృంభిస్తున్న డెంగీని నివారించేందుకు క్షేత్రస్థాయిలో యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని నగరవాసులు, ప్రజాసంఘాల ప్రతినిధులు కోరుతున్నాయి.



మెయిన్ రోడ్డుపై కుప్పలుగా పడి ఉన్న చెత్త



నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం(ఫైల్)

జేపీఎల్ విజేత.. జయపురం రాయల్స్



నిర్వాహకులతో విజేత, రన్నరప్ జట్లు

జయపురం: జయపురం ప్రీమియర్ లీగ్(జేపీఎల్)–2023 విజేతగా రాయల్స్ జట్టు ఘన విజయం సాధించింది. పట్టణంలోని విక్రమ క్రీడా మైదానంలో(దసరా పాడియా) సూపర్‌స్టార్ టీమ్‌తో బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో 64పరుగుల తేడాతో ట్రోఫీ కైవసం చేసుకుంది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన రాయల్స్ జట్టు.. నిర్దేశిత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 257 భారీ స్కోరు చేసింది. ఆదిత్యరౌత్ 64 బంతుల్లో 18 సిక్స్‌లు, 11 ఫోర్లతో 174 పరుగులతో రికార్డు సృష్టించాడు. అనంతరం 258 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన సూపర్‌స్టార్ జట్టు 17.3 ఓవర్లలో 194 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఈ మేరకు విజేత, రన్నరప్‌కు నిర్వాహకులు ట్రోఫీ, నగదు బహుమతి అందించారు. ఆదిత్యరౌత్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచాడు.

తాగి గొడవ చేస్తున్నాడని గొడ్డలితో దాడి

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి సోనగుమ్మ గ్రామంలో తాగి గొడవ చేస్తున్నాడనే కారణంతో తమ్ముడు కొడుకు చేసిన దాడిలో పెదనాన్న సోమానాథ్ భుమియా(60) మృతిచెందాడు. రోజు తరహాలోనే మంగళవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చిన సోమనాథ్.. ఏదో విషయమై గొడవకు దిగారు. అంతా నిద్రిస్తున్న సమయంలో పెద్దగా కేకలు వేయడంతో తమ్ముడి కొడుకు సనీయా భుమియా నిలదీశాడు. అయితే అతనిని కూడా అసభ్య పదజాలంతో తిట్టడం మొదలు పెట్టాడు. దీంతో ఆగ్రహానికి గురైన యువకుడు.. సమీపంలోని గొడ్డలిలో బలంగా దాడి చేశాడు. వృద్ధుడు అక్కడికక్కడే కుప్పకూలి, మృతిచెందాడు. దీనిపై పోలీసుల ఎదుట లొంగిపోయిన యువకుడు.. నేరాన్ని అంగీకరించాడు. ఈ మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని, పోస్టుమార్టం నిమిత్తం మత్తిలి ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

వర్షాలకు ముందుగానే పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న చైర్మన్ నరేంద్ర మహంతి

- జయపురం మున్సిపల్ చైర్మన్ నరేంద్ర మహంతి

జయపురం: వర్షాల సీజన్ ప్రారంభానికి ముందుగానే పట్టణంలో డ్రైనేజీ, పారిశుద్ధ్య పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు, సిబ్బంది, సంసిద్ధం కావాలని చైర్మన్ నరేంద్ర మహంతి ఆదేశించారు. ఆయన అధ్యక్షతన మున్సిపాలిటీ కౌన్సిల్ సభాగృహంలో వర్షాకాల సన్నద్ధత, పారిశుద్ధ్య నిర్వహణపై బుధవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈఓ సిద్ధార్థ పట్నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చైర్మన్ మాట్లాడారు.పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఏటా వర్షాల సమయంలో వరదనీరు రోడ్డుపైకి వస్తోందని గుర్తు చేశారు. దీనివల్ల రోగాలు వ్యాపించడంతో పాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనిని నివారించేందుకు ముందుగానే మురుగు వ్యవస్థను బాగు చేయాలన్నారు. ఈ మేరకు అన్ని వార్డుల్లో డ్రైన్‌లలో రోజూ దోమల మందు ప్రతిరోజూ స్ప్రే చేయడం, క్లోరినేషన్ వంటి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాలిథిన్ నిషేధంపై సిబ్బందికి తగిన శిక్షణ అందించాలన్నారు. ప్రధానంగా మెయిన్ రోడ్డు, మహాత్మాగాంధీ రోడ్డు, బెల్ రోడ్డు, ఎన్‌కేటీ రోడ్డులో ట్రాఫిక్‌కు సమస్య లేకుండా రాత్రి సమయంలోనే శుభ్రం చేయాలని సూచించారు. స్థానికంగా ఉన్న చీపుర్లకు అదనంగా బరంపురం, కటక్ నగరాల్లో వినియోగిస్తున్న 1.5 మీటర్ల బ్రష్ చీపుర్లు వినియోగించాలని అభిప్రాయం వ్యక్తంచేశారు. చాలామంది కంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికులు దీర్ఘకాల సెలవులో ఉన్నారని, దీంతో వార్డుల్లో పారిశుద్ధ్యంపై ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. అటువంటి వారిని గుర్తించి, కొత్త కార్మికులను నియమించాలని స్పష్టంచేశారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ బి.సునీత, కౌన్సిలర్ జస్పాల్ సింగ్, సిబ్బంది గోపాల సాహు, 31మంది పారిశుద్ధ్య కార్మికులు, 9మంది సూపర్‌వైజర్లు, 28మంది జమాదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డెక్కిన విద్యార్థినులు



రోడ్డుపై ఆందోళన చేస్తున్న మిట్స్ హాస్టల్ విద్యార్థినులు

- నీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్

రాయగడ: మజ్జిగౌరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(మిట్స్) కళాశాల విద్యార్థులు నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ రోడ్డెక్కారు. భుజబల్ గ్రామంలోని కళాశాలకు చెందిన 100మంది విద్యార్థులు స్థానిక ఆర్‌కే నగర్ సమీపంలోని మారుతీ కాలనీలో ఉన్న హాస్టల్‌లో ఉంటున్నారు. నీటి ఎద్దడి తీవ్రతరం కావడంతో వీరంతా తమ సమస్యను పరిష్కరించాలని ఆందోళన చేపట్టారు. పట్టణంలోని మారుతీనగర్, ఆర్‌కే నగర్, రైతులకాలనీ, అంజయ్యపేట, ఉత్కళమణి నగర్ తదితర ప్రాంతాల్లో గత కొద్ది రోజులుగా నీటి సమస్య తీవ్రంగా ఉంది. ఈ క్రమంలో మారుతీనగర్ లోని మిట్స్ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థుల కోసం పట్టణ ఆరోగ్యశాఖ ద్వారా ప్రత్యేకంగా తాగునీటి కుళాయిని మిట్స్ యాజమాన్యం గతంలో ఏర్పాటు చేసింది. ప్రస్తుతం నీటి సమస్య వేధిస్తుండటంతో యాజమాన్యం ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తుండేవారు. అయితే సుమారు 100మంది విద్యార్థులు ఉండగా.. రోజూ 4, 5 ట్యాంకర్ల నీటిని తీసుకు రావడం, అవి ఎటూ సరిపోవడం లేదని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుధవారం ఉదయం కళాశాలకు సమయం అవుతుండగా.. ట్యాంకర్లు సకాలంలో రాకపోవడంతో ఆందోళన ఆందోళన బాట పట్టారు. తరగతులు బహిష్కరించి, రోడ్డు పైకి చేరుకొని నినాదాలు చేశారు. దీనిపై కళాశాల యాజమాన్యం స్పందించి, నచ్చజెప్పడంతో వారంతా ఆందోళన విరమించారు. పట్టణంలో తాగునీటి ఎద్దడి కొనసాగుతున్నా అధికారులు స్పందించక పోవడం గమనార్హం.

వడగళ్ల వానతో దెబ్బతిన్న పంటలు



రైతులతో చర్చించి పంట నష్టాన్ని అంచనా వేస్తున్న ఎమ్మెల్యే

- క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎమ్మెల్యే తారాప్రసాద్



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి

జయపురం: గత కొద్ది రోజులుగా కొరాపుట్ జిల్లాలో కురిసిన వడగళ్ల వర్షాల కారణంగా వివిధ ప్రాంతాల్లో పంట పొలాలు దెబ్బతిన్నాయి. జయపురం అసెంబ్లీ పరిధి బొరిగుమ్మ సమితిలోని హోర్తలి, కమత పంచాయతీల్లో వందల ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లింది. ఈ మేరకు ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ప్రభావిత ప్రాంతాలు, పంటలను స్వయంగా పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడి, నష్టాన్ని అంచనా వేశారు. అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఓదార్చారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. బొరిగుమ్మ అదనపు తహసీల్దార్ సంజీవ్‌కుమార్ కులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గుప్తప్రసాద్ నాయక్, వ్యవసాయ అధికారి రశ్మిత పండాతో మాట్లాడారు. వెంటనే పంట నష్టంపై సర్వే చేపట్టి, వాస్తవ పరిస్థితులను ప్రభుత్వానికి నివేదించాలని సూచించారు. ఏ ఒక్క రైతు నష్టపోకుండా చర్యలు చేపట్టాలని ఆకాంక్షించారు. లేనిపక్షంలో బాధితులకు ఆత్మహత్యలే శరణ్యమని, ఆ పరిస్థితి రాకుండా సత్వరమే స్పందించాలని కోరారు.

మినిస్టీరియల్ ఉద్యోగుల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

పర్లాకిమిడి: ప్రభుత్వం మూడో తరగతి ఉద్యోగులకు చెల్లించాల్సిన రూ.4,200ల గ్రేడ్‌పే రెండేళ్లుగా పెండింగ్‌లో ఉందని మిళిత అమలా సంఘం(మినిస్టీరియల్ ఉద్యోగులు) వాపోయారు. ఇప్పటికైనా దీనిని చెల్లించాలని డిమాండ్ చేస్తూ వారంతా గజపతి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట బుధవారం నిరసన వ్యక్తం చేశారు. నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. అంతకుముందు సమావేశ మందిరం హాల్2లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రేడ్‌పే విషయంలో రెండు దఫాలు ప్రభుత్వంతో చర్చలు జరిపినా పరిష్కరించలేదన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈనెల 31 వరకు వివిధ రూపాల్లో నిరసన తెలిపేందుకు నిర్ణయించామని ప్రకటించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే సామూహిక సెలవులకు సైతం వెనుకాడమని వివిరంచారు. నిరసనలో ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి సంధ్యారాణి శొబొరొ, శంకర్ సురేస్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలపై ఎంపీ, ఎమ్మెల్యే

- అధికారిక వాహనాలు వదిలి, వీధుల్లో పర్యటించిన ప్రజా ప్రతినిధులు



చైనా మార్కెట్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, చైర్మన్



ద్విచక్ర వాహనాలపై పర్యటిస్తున్న ఎంపీ రమేష్ మాఝి, ఎమ్మెల్యే సదాశివ, పక్కన చైర్మన్ కును నాయక్

కొరాపుట్: నవరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు రమేష్‌చంద్ర మాఝి, ఎమ్మెల్యే సదాశివ ప్రధాన్ ద్విచక్ర వాహనాలతో సుడిగాలి పర్యటన చేశారు. బుధవారం నవరంగ్‌పూర్ మున్సిపాలిటీలో 10వేర్వేరు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు సంబంధించి శిలా ఫలకాల ఆవిష్కరణలు చేయాల్సి ఉంది. ఎండ తీవ్రతతో ముందు జాగ్రత్తగా ఉదయం 8 నుంచి 10 లోగా కార్యక్రమాలు ముగించాలని స్థానిక బీజేడీ నేతలు నిర్ణయించారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు, కార్యకర్తలు ఉదయాన్ని శంకుస్థాపనల ప్రాంగణానికి చేరుకున్నారు. అయితే వివిధ కారణాలతో ఎంపీ, ఎమ్మెల్యే ఉదయం 10 గంటలకు మొదటి కార్యక్రమానికి వచ్చారు. ఎండ పరిస్థితి గమనించిన పట్టణంలో మారుమూల వీధుల్లోకి భారీ కాన్వాయ్ వెళ్లదని గుర్తించారు. దీంతో ఇరువురు నేతలు ద్విచక్ర వాహనాలను ఆశ్రయించారు. ఇదే కార్యక్రమాకి బీజేపీకి చెందిన నవరంగ్‌పూర్ మున్సిపల్ చైర్మన్ కును నాయక్ కూడా హాజరయ్యారు. ఎంపీ, ఎమ్మెల్యేలు ద్విచక్ర వాహనాలను ఆశ్రయించడంతో ఏం చేయాలో పాలుపోని ఆయన.. పరిచయం ఉన్న మరో యువకుడి బైక్‌పై పయనమయ్యారు. ముఖ్య నేతలు ఇలా వీధుల్లో పర్యటిస్తూ ప్రజల సమస్య అడిగి తెలుసుకోవడం, శంకుస్థాపనలు చేయడంతో సందడి నెలకొంది. కార్యక్రమాల్లో భాగంగా రూ.50 లక్షల విలువైన సామాజిక భవనాలకు శంకుస్థాపనలు జరిగాయి.

క్లుప్తంగా

పాఠశాల అభివృద్ధికి ఎంపీ నిధులు మంజూరు



దేవగిరి ఉన్నత పాఠశాల

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి దేవగిరి ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం అదనపు తరగతి గదుల నిర్మాణానికి కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక రూ.10 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు ఎంపీ కార్యాలయం బుధవారం ప్రకటన విడుదల చేసింది. రాయగడ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు చేపట్టేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. దీనికి సంబంధించి ఆశాఖ జూనియర్ ఇంజినీర్ శెఠి పాఠశాలను బుధవారం సందర్శించారు. త్వరలో పనులు చేపట్టేందుకు ముందుగా సర్వే చేపట్టినట్లు ఆయన తెలిపారు. నిధుల మంజూరుపై పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ఫార్మా పరిశ్రమలో ఉద్యోగాలకు శిక్షణ



మాట్లాడుతున్న యు.ఎన్.బి.రాజు

రణస్థలం: ఫార్మా పరిశ్రమలో ఉద్యోగాలు పొందేందుకు ఎమ్మెస్సీ చదివిన విద్యార్థులకు ఉచితంగా నాలుగు నెలలు శిక్షణ ఇస్తున్నామని అరబిందో కార్పొరేట్ హెచ్ఆర్ డిపార్ట్‌మెంట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ యు.ఎన్.బి.రాజు తెలిపారు. రణస్థలం మండలంలోని పరిసాం సమీపంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాలుగు నెలలు శిక్షణ పూర్తి చేసుకున్న ఎనిమిదో బ్యాచ్‌కు చెందిన 40 మంది విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ సర్టిఫికెట్లను బుధవారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెస్సీ చదివి ఎంపిక కాబడిన విద్యార్థులకు ఫార్మాసిటికల్ క్వాలిటీ కంట్రోల్ అనలైటికల్ టెక్నిక్స్ శిక్షణను నాలుగు నెలలు పాటు ఇవ్వడం జరిగిందన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే, అధునాతన యంత్రాలతో ఫార్మా, కెమికల్స్‌కు అవసరమైన శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో యూనిట్ హెచ్ఆర్ హెడ్ కమలాకర్‌రెడ్డి ఉన్నారు.

కల్యాణం..కమనీయం



ఎండల మల్లికార్జునస్వామికి కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

టెక్కలి: మండలంలోని రావివలసలో బుధవారం ఎండల మల్లికార్జునస్వామి వార్షిక కల్యాణం కమనీయంగా జరిగింది. ఆలయ కార్యనిర్వాహణాధికారి వి.వి.ఎస్.నారాయణ నేతృత్వంలో అర్చకులు రామకృష్ణ, యుగంధర్, వేద పండితులు ఆధ్వర్యంలో ముందుగా ఉత్సవమూర్తులతో తిరువీధి నిర్వహించారు. అనంతరం వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.బాలకృష్ణ, ఆలయ మాజీ కమిటీ చైర్మన్ ఎస్.సుధాకర్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఉద్యోగుల సమస్యలు, డిమాండ్లను ప్రభుత్వం పరిష్కారం చేసే దిశగా ఆలోచన చేయాలని ఉద్యోగుల సంఘ జిల్లా కార్యదర్శి అలికాన రాజేశ్వరి అన్నారు. ఉపాధ్యాయ, కార్మిక, పింఛన్‌దారులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని మండల రెవెన్యూ కార్యాలయం వద్ద బుధవారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తమ సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిందన్నారు. ఇటీవల రాష్ట్ర నాయకత్వం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఈనెల ఐదో తేదీన సమ్మె నోటీసు అందజేసినట్టు చెప్పారు. సమస్యలన్నీ పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కారిమి రాజేశ్వరరావు, కూన వెంకట సత్యనారాయణ, రామారావు, కిల్లారి నారాయణరావు, జయమ్మ పాల్గొన్నారు.

31న మణినాగేశ్వరస్వామి కల్యాణ ఉత్సవం

శ్రీకాకుళం రూరల్: కళ్లేపల్లి గ్రామంలో వెలసిన గౌరీ సమేత మణి నాగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలను ఈనెల 31న నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి సూర్యనారాయణమూర్తి, కార్యనిర్వాహణాధికారి పొన్నాడ శ్యామలరావులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆరు గంటలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ఎనిమిది గంటలకు పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులకు అన్నదానం, సాయంత్రం ఐదు గంటలకు కల్యాణ మూర్తుల తిరువీధి ఉంటుందన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు విభుతి జెనా

బరంపురం:

దక్షిణ ఒడిశాలో కేంద్ర బింధువుగా నిలిచిన గంజాం జిల్లాలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా బీజేపీ అధ్యక్షుడు విభుతి జెనా కోరారు. స్థానిక గిరి మెయిన్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో బీజేపీ జిల్లాస్థాయి సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులంతా కలసికట్టుగా కృషి చేయాలని సూచించారు. అంతా ఐఖ్యమత్యంతో పనిచేసి, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. దీనికి సంబంధించి ఇప్పటి నుంచే ప్రతి బ్లాక్, పంచాయతీ స్థాయిలో ప్రజలతో మమేకం కావాలని తెలిపారు. కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కార్ అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. అలాగే రాష్ట్రంలో బీజేడీ సర్కార్ అవినీతి, ప్రజా వ్యతిరేక విధానాలను తెలియజేయాలని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ కార్యదర్శి మదన్‌మోహన్ పాత్రో, సునీల్‌సాహు, కైలాస్ సడంగి, బ్లాక్ అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు విభుతి జెనా



సమావేశంలో పాల్గొన్న బ్లాక్ అధ్యక్షులు, నాయకులు

విద్యుత్ సేవలు మృగ్యం

- కైలాసపూర్ సబ్‌స్టేషన్‌కు తాళం వేసిన గ్రామస్తులు

రాయగడ: కొద్ది రోజుల క్రితం సంభవించిన కాలవైశాఖి కారణంగా జిల్లాలోని కొలనార సమితి పలు గ్రామాల్లో విద్యుత్ తీగలు తెగి సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. రోజులు గడుస్తున్నా విద్యుత్‌శాఖ అధికారులు పునరుద్ధరణ పనులు చేపట్టలేదు. సమస్యను సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు.. కొలనార సమితి పరిధిలోని కైలాసపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు బుధవారం తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. గాలివాన ప్రభావంతో హతికొంబ, బుంధుగుడ, పూజారిగుడ, ఎండికాలనీ, లలిబి, కారుబాయి, ఇటికాపొంగ, ఇరన్‌జోలి, భెజా, డిసిలబడి తదితర గ్రామాల్లో విద్యుత్ తీగలు తెగిపోయాయని తెలిపారు. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోగా, తాగునీటికి కూడా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. వేసవి ఉక్కపోతకు తోడు నీటి ఎద్దడి తలెత్తడంతో గ్రామస్తులంతా కలిసి సంబంధిత శాఖ అధికారులకు సమస్యను వివరించారు. అయితే రోజులు గడుస్తున్నా పట్టించుకోక పోవడంతో సబ్‌స్టేషన్‌కు తాళం వేశారు. ఎట్టకేలకు దిగివచ్చిన అధికారులు.. 3రోజుల్లో పూర్తిస్థాయిలో సరఫరాను పునరుద్ధరిస్తామని హామీ ఇవ్వడంతో అంతా ఆందోళన విరమించారు.



సబ్ స్టేషన్‌కు తాళం వేస్తున్న గ్రామస్తులు

గాలివాన బీభత్సం

- విరిగిపడిన విద్యుత్ స్తంభాలు
- నేలరాలిన మామిడి కాయలు



ఎల్.ఎన్.పేట: తురకపేట సమీపంలో విరిగిపడిన విద్యుత్ స్తంభం

ఎల్.ఎన్.పేట : జిల్లాలో పలు ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఎల్.ఎన్.పేట మండలంలో ఈదుర గాలుల కారణంగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. భారీ చెట్లు పడిపోవటంతో పాటు కొమ్మలు విరిగిపోయాయి. సుమారు అరగంట పాటు కుండపోతగా వర్షం కురిసింది. మండల కేంద్రంలో రేకుల షెడ్లు ఎగిరి పడ్డాయి. ఇటుకల తయారీదారులకు, మామిడి తోటల రైతులకు అపార నష్టం కలిగింది. పంట చేతికి అందివచ్చే సమయంలో కాయలు రాలిపోవటంతో నష్టం తప్పలేదని మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తురకపేట రోడ్డులో ఈదుర గాలుల ధాటికి ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో డ్రైవర్ ఒక్కరే ఉండటంతో పెను ప్రమాదం తప్పింది.

- **ఆమదాలవలస రూరల్:** ఈదురుగాలుల ధాటికి సైలాడ, కుమ్మరిపేట గ్రామాల్లో రెండు విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వెంటనే ఎలక్ట్రికల్ రూరల్ ఏఈ బి.రవికుమార్ సిబ్బందితో వెళ్లి సరఫరా పునరుద్ధరించారు.



ఎల్.ఎన్.పేట: తురకపేటలో ఎగిరిపడిన రేకుల ఇళ్లు

సాఫ్ట్‌బాల్ జట్లు పయనం



ఎంపికైన క్రీడాకారులతో అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ కడప జిల్లాలోని సునందపల్లిలో ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే జిల్లా బాలురు, బాలికల జట్లు బుధవారం పయనమై వెళ్లాయి. పది రోజులగా కేశవరావుపేట జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో ప్రత్యేక శిబిరం నిర్వహించి, క్రీడాకారులకు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. జట్టుకు 16 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. కేశవరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో క్రీడాకారులన సంఘ ప్రతినిధులు అభినందించారు. జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ కన్వీనర్ కలిదండి వెంకట రామరాజు మాట్లాడుతూ.. ఉత్తమ ప్రతిభ కనబర్చి విజయంతో రావాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు స్పోర్ట్సు దుస్తులను ఏపీజీవీబీ మేనేజర్ పూజారి వెంకటేష్ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడి భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యుడు సూర జగదీశ్వరరావు, మాజీ సర్పంచ్ పొందూరు భీమారావు, జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మెట్ట తిరుపతిరావు, కోచింగ్ శిబిరం ఇన్‌చార్జి మొజ్జాడ వెంకటరమణ, పీడీ గొంటి మల్లేష్ పాల్గొన్నారు.

సంబరం ఆరంభం



ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత నీలమణిదుర్గ అమ్మవారి పెద్ద పండుగల్లో ప్రధాన సంబరం బుధవారం ప్రారంభమైంది. పట్టాజంగిడతో అమ్మవారిని ఊర్లోకి ఆహ్వానించే మహోత్సవం అట్టహాసంగా జరిగింది. పిన్నింటి కుటుంబ సభ్యులు పట్టాజంగిడెను పట్టుకొని అమ్మవారిని గ్రామంలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేషధారణలు, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. -పాతపట్నం



ఆకట్టుకున్న దుర్గా వేషధారణలు



థింసా నృత్యం చేస్తున్న మహిళలు

మిరావళిలో క్రికెట్ టోర్నీ ప్రారంభం



మ్యాచ్ ప్రారంభం సందర్భంగా క్రీడాకారులతో అతిథులు

రాయగడ: జిల్లాలోని సదర్ సమితి పరిధిలోని మిరావళిలో సమితి స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. రైతు ఐక్యతా పరిషత్ జిల్లాశాఖ అధ్యక్షుడు ప్రతాప్ పువ్వల ముఖ్య అతిథిగా హాజరై, టోర్నమెంట్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు ప్రభుత్వం సరైన ప్రోత్సాహం అందివ్వకపోవడంతో క్రీడాకారులు ఆయా రంగాల్లో రాణించలేక పోతున్నారని అభిప్రాయం వ్యక్తంచేశారు. ఒకవైపు క్రీడా రంగానికి పెద్దపీట వేస్తున్నామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా.. దీనికి అనుగుణంగా చర్యలు చేపట్టడం లేదన్నారు. దీంతో గ్రామీణ ప్రాంత యువత ఎంతో నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం క్రీడా రంగానికి తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఇదిలా ఉండగా.. 10రోజులు కొనసాగనున్న ఈ టోర్నమెంట్‌లో మొత్తం 31 జట్లు పాల్గొనున్నాయి. ప్రారంభ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన తెడబటికి జట్టు.. నిర్ణీత 10 ఓవర్లలో 108 పరుగులు చేసింది. లక్ష ఛేదనలో ఖింజిలి జట్టు 106 పరుగులకే ఆలౌట్ అయి, తబబడింది. దీంతో తెడబటికి 2పరుగుల తేడాతో విజయం సాధించింది. కార్యక్రమంలో రైతు ఐఖ్యత పరిషత్ జిల్లా కార్యదర్శి ప్రీతమ్ కుమార్, శంకర్ నాయుడు, సర్పంచ్ నిరంజన్ బిడ్డిక తదితరులు పాల్గొన్నారు.



టోర్నమెంట్ ప్రారంభిస్తున్న పువ్వల ప్రతాప్

జీడికి మద్దతు ధర ప్రకటించాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న సంఘ నాయకులు

కాశీబుగ్గ: జీడి పంటకు మద్దతు ధర ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు కోరారు. 80 కిలోల బస్తాకు రూ.16 వేలుగా నిర్ణయించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. పలాసలోని వేదిక మినీ హాల్‌లో బుధవారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల్లో జీడి పంట సాగు చేస్తున్నారన్నారు. శ్రీకాకుళం జిల్లాలో లక్ష ఎకరాల్లో జీడి పంట సాగు చేస్తుండగా దీనిపై 80 వేల మంది రైతులు ఆధారపడి జీవిస్తున్నారన్నారు. కేరళ రాష్ట్రం మాదిరిగా జీడి బోర్డును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. జీడిని పండించిన రైతు, కొనుగోలు చేసిన వినియోగదారుడు నష్టపోతుండగా..వ్యాపారి మాత్రం లాభ పడుతున్నారన్నారు. రైతులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో జీడి రైతుల సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, పౌరహక్కుల సంఘం నాయకుడు పిండి వెంకటరావు, రైతాంగ సాధన కమిటీ నాయకులు నల్ల హడ్డి, కె.హేమారావు చౌదరి, వంకల మాధవరావు, జి.బాలకృష్ణ, పోతనపల్లి కుసుమ, హేమావతి, గణపతి, సింహాద్రి, బత్తిని ఒంకారం, వినోద్‌కుమార్, బాష్కరరావు, అప్పలస్వామి, వాసుదేవరావు, పురుషోత్తం, ఆనందరావు పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న గీతం డిగ్రీ కళాశాలలో మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో గురువారం ఉదయం తొమ్మిది గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్. రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డెక్కన్ ఫైన్ కెమికల్స్, ఎస్‌బీఐ కార్డ్స్, అపోలో ఫార్మసీ, సోలేరా, బిగ్ బాస్కెట్, సీతః టీసీటీ సోలార్ ఎనర్జీ, ఏటూబీ, జయభేరి, నవతా ట్రాన్స్‌పోర్ట్, మెడిప్లస్, బొల్లినేని మెడ్ స్కిల్స్ (జెమ్స్) వంటి సంస్థల్లో ఖాళీలను అర్హులైన అభ్యర్థులతో భర్తీ చేయనున్నట్టు చెప్పారు. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు వారి బయోడేటాతోపాటు డిగ్రీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రెండు పాస్‌ఫొటోలతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 95051 50287, 70136 08073 సంప్రదించాలన్నారు.

అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తా

- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్

రణస్థలం: రానున్న 2024 ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లోనూ పోటీ చేస్తానని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కే.ఏ.పాల్ అన్నారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం పైడిభీమవరంలో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పాల్ మాట్లాడుతూ పైడిభీమవరం పారిశ్రామికవాడలో కాలుష్యం ఎక్కువగా ఉందన్నారు. అభివృద్ధి, తాగునీటి సౌకర్యాలు లేవన్నారు. స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం లేదన్నారు. ఇప్పుడు మీడియా ద్వారా పరిశ్రమల యాజమాన్యాలకు ఒకటే చెబుతున్నానని, 30 రోజుల్లోగా అభివృద్ధి విషయమై సమాధానం చెప్పకపోతే హైకోర్టులో అపీల్ చేస్తానని అన్నారు. లేదంటే 72 గంటల్లో హైదరాబాద్ వచ్చి నన్ను కలవాలన్నారు. 'పవన్ కల్యాణ్ తమ్ముడూ రా.. నిన్ను ముఖ్యమంత్రిని చేస్తానని గతంలో చెబితే వద్దు లోకేష్‌నే ముఖ్యమంత్రి చేస్తానని అన్నావు. జగన్‌ను ఓడించడం, చంద్రబాబును గెలిపించడమే నాలక్ష్యం అన్నావు.. ఓకే నువ్వు వెళ్లి గెలిపించుకో.. కాపులందరూ.. బీసీలందరూ ప్రజాశాంతి పార్టీలో చేరిపోతున్నారు. బుర్రున్నోళ్లు ప్రజాశాంతి పార్టీలో చేరుతారని పాల్ చెప్పారు.



మాట్లాడుతున్న కే ఏ పాల్

టెన్త్ టాపర్ బాలవర్ధన్‌కు సన్మానం

మందస: కుంటికోట గ్రామానికి చెందిన మానిమి బాలవర్ధన్ పదో తరగతిలో 583 మార్కులు సాధించాడు. ఈయన మహాత్మా జ్యోతిబాపూలే మత్స్యకార గురుకుల పాఠశాలలో చదివాడు. అధిక మార్కులు సాధించడంతో ఈ విద్యార్థిని రాష్ట్ర ప్రభుత్వం సన్మానించింది. ప్రభుత్వ విద్యాసంస్థలో చదువుతూ మంచి మార్కులు తెచ్చిన బాలవర్ధన్ విజయవాడలోని తుమ్మలపల్లి క్షత్రియ కళాక్షేత్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో అవార్డు అందజేసి సన్మానించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖామంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ, మహాత్మా జ్యోతిబాపూలే మత్స్యకార గురుకులాల ప్రిన్సిపల్ సెక్రటరీ అనంతరాం, సెక్రటరీ కృష్ణమోహన్‌రావు చేతుల మీదుగా బాలవర్ధన్ మెమెంటోను అందుకున్నాడు.



అవార్డును అందుకుంటున్న బాలవర్ధన్

అర్జీలు రీఓపెన్ కారాదు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జగనన్నకు చెబుదాం(స్పందన)లో వచ్చిన అర్జీలు రీఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ వీడియో సమావేశ మందిరంలో స్పందన రీఓపెన్ అర్జీలపై సంబంధిత అధికారులతో జేసీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్య పరిష్కరించకపోవడం, ఇచ్చిన సమాధానంతో సంతృప్తిపడకపోవడం వల్లే అర్జీలు రీఓపెన్ అవుతాయన్న సంగతిని గుర్తించాలన్నారు. ఇకపై ఇటువంటివి పునరావృతం కారాదని, సరైన సమాధానం ఇవ్వకుండా ఫైలు ముగించాలని చూస్తే అటువంటి అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించాకే చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందనకు అధిక ప్రాధాన్యమిస్తున్నారని, అంతే ప్రాధాన్యతతో ఫిర్యాదులు పరిష్కరించాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, జిల్లా పంచాయతీ అధికారి వి.రవి కుమార్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఆర్.వెంకటరామన్, డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు, గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకుడు ఎన్.గణపతిరావు, జిల్లా సరఫరాల అధికారి డి.వి.రమణ, కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజినీర్ ఎస్.శంకర్‌నాయక్, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు డాక్టర్ ఎం.కిషోర్, స్పందన విభాగం పర్యవేక్షకుడు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఐటీఐలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం రూరల్: 2023 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ, ప్రైవేటు పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దర ఖాస్తులు స్వీకరిస్తున్న ట్టు విజయనగరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ ఎం.గోపాలకృష్ణ బుధవారం తెలిపారు. అభ్యర్థులు ఎన్ని ఐటీఐలకైనా, ఏ జిల్లాలోనైనా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పా రు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అనంత రం అభ్యర్థి యూనిక్ సంఖ్యతో కూడిన ప్రింట్ ను తీసుకుని ప్రవేశ సమయంలో అందజేయాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు వచ్చే నెల 6 వరకు ఐటీఐ.ఏపీ.జీవోవి.ఐఎన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అక్రమ తవ్వకాలపై తనిఖీ

విజయనగరం ఫూల్‌బాగ్: గ్రావెల్ అక్రమ తవ్వకందారులపై మైన్స్ విజిలెన్స్ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. గంట్యాడ మండలం కొండతామరాపల్లిలో పట్టాభూముల్లో అక్రమంగా 56,538 క్యూబిక్ మీటర్లు గ్రావెల్ తవ్వినట్టు మంగళ, బుధవారం జరిపిన తనిఖీల్లో గుర్తించినట్టు జిల్లా విజిలెన్స్ స్క్వాడ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌పీకే మల్లేశ్వరరావు తెలిపారు. పీఎస్‌కే, వృద్ధి ఇన్‌ఫ్రాటెక్‌లిమిటెడ్ హైవే కంపెనీలకు సుమారు రూ.2 కోట్ల అపరాధ రుసుము విధించామని చెప్పారు.

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

విజయనగరం ఫూల్‌బాగ్: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం జరిగిన ఫస్టియర్ తెలుగు, సంస్కృతం, హిందీ పరీక్షలకు 3,796 మందికి 3528 మంది హాజరయ్యారు. 268 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ పరీక్షకు 414 మందికి 85 మంది గైర్హాజరుకాగా, 329 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన సెకిండియర్ పరీక్షకు 1240 మందికి 143 మంది గైర్హాజరుకాగా, 1097 మంది హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 278 మందికి 43 మంది గైర్హాజరు కాగా, 235 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్టు ఆర్‌ఐఓ మజ్జి ఆదినారాయణ తెలిపారు.

నేడు మెడికల్ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్

విజయనగరం ఫూల్‌బాగ్: ఉమ్మడి విజయనగరం జిల్లాలోని జిల్లా పరిషత్, గవర్నమెంట్ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, స్కూల్‌అసిస్టెంట్లు, ఎస్‌జీటీల మెడికల్ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ గురువారం నిర్వహిస్తామని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి బుధవారం ఒకప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రభుత్వాస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ సమక్షంలో ఉదయం 10 గంటలకు జరిగే ధ్రువపత్రాల నిజనిర్ధారణకు ఆయా కేటగిరీల ఉపాధ్యాయులు హాజరుకావాలని కోరారు.

ఆరు పూరిళ్లు దగ్ధం

మెరకముడిదాం: మండలంలోని చినపూతికవలస గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో ఆరు పూరిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామానికి చెందిన కలిగి లక్ష్మునాయుడు, కలిగిఅప్పన్న, సామాదుల శివరాం, కలిగిరమణ, గురాన ఉగాదమ్మ, గురానసూరీడమ్మలకు చెందిన పూరిళ్లు కాలిపోయాయి. ఈప్రమాదంలో బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. తినేందుకు ఉంచుకున్న ధాన్యం, దాచుకున్న డబ్బులు, తదితర వస్తువులు మొత్తం కాలిబూడిదైపోవడంతో బాధితులు రోడ్డున పడ్డారు. తమ గూడు కళ్లముందే కాలిపోతుంటే ఏమీ చేయలేక చూస్తూ భోరున విలపించారు. అయితే ఈఅగ్నిప్రమాదం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల జరిగిందా? పిడుగుపడి జరిగిందా? అన్నది తెలియాల్సి ఉంది. అగ్నిప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ గిరిధర్ వెంటనే సంఘటనా స్థలాన్ని సందర్శించి బాధితుల నుంచి స్థానికుల నుంచి అగ్నిప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో ఆస్తినష్టం ఎంత జరిగిందో అంచనా వేస్తామని తెలిపారు.

వేధింపులు తాళలేక బాలిక ఆత్మహత్య

కొత్తవలస: మండలంలోని ముసిరాం గ్రామానికి చెందిన బాలికను ఆదే గ్రామానికి చెందిన మాకిరెడ్డి గాడేలు ప్రేమ పేరుతో వేధిస్తుండడంతో బాలిక తాళలేక బుధవారం పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు ఎస్‌ఐ బొడ్డు దేవి మాట్లాడుతూ పురుగు మందుతాగి ఆపస్మాక స్థితిలో ఉన్న బాలికను హుటాహుటిన విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చెప్పారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు శవ పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగు మందు తాగి మహిళ..

భోగాపురం: మండలంలోని బోడిసింగిపేట గ్రామానికి చెందిన కారి అప్పయ్యమ్మ(56) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కొంత కాలంగా శ్వాసకోస సమస్య ఎదుర్కొంటున్న ఆమెకు భర్త సత్తెయ్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ సంపాదన అంతా తన మందులకే వస్తున్నాయని ఆర్థికంగా కష్టమవుతోందని మనస్తాపం చెందిన ఆమె మంగళవారం ఉదయం పురుగు మందు తాగి ఆపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. దీంతో కూమారులు తల్లిని విజయనగరం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందింది. భర్త సత్తెయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

- స్నేహితురాలే హంతకురాలు!
- ప్రియుడితో కలిసి హతమార్చిన వైనం
- కళ్లేపల్లి బుక్‌కీపర్ మహేశ్వరి హత్య కేసును ఛేదించిన పోలీసులు
- ఆర్థిక లావాదేవీలే హత్యకు కారణం
- ముగ్గురు నిందితులను అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచిన పోలీసులు

నమ్మించి.. హతమార్చి..



హత్యకు గురైన గోకేడ మహేశ్వరి (ఫైల్)



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గోవిందరావు, వెనుకన ముసుగులో నిందితులు

లక్కవరపుకోట:

వారిద్దరూ మంచి స్నేహితులు. ఒకే గ్రామం, ఒకే విధులు కావడంతో ఎక్కడికి వెళ్లినా కలిసే వెళ్లేవారు. వారి మధ్యతలెత్తిన ఆర్థిక విబేధాలతో స్నేహితురాలే నమ్మించి పథకం ప్రకారం తన ప్రియుడితో కలిసి స్నేహితురాలిని హతమార్చింది. ఎల్.కోట మండలం కళ్లేపల్లి గ్రామంలో వైఎస్సార్ క్రాంతిపథంలో బుక్ కీపర్‌గా పని చేస్తున్న గోకేడ మహేశ్వరి హత్యకేసును పోలీస్‌లు ఛేదించారు. నిందితులను కోర్టులో హాజరుపరచడంతో రిమాండ్ విధించారు. ఎల్.కోట పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు వెల్లడించారు. కళ్లేపల్లి గ్రామానికి చెందిన గోకేడ మహేశ్వరి, గాడి చిన్నతల్లిలు వైఎస్సార్ క్రాంతి పథంలో బుక్ కీపర్లుగా పనిచేస్తున్నారు. ఒకే చోట ఉద్యోగం కావడంతో ఎక్కడికి వెళ్లినా కలిసే వెళ్లేవారు. ఇరువురి మధ్య ఆర్థిక లావాదేవీలు సాగాయి. ఈ క్రమంలో నిందితురాలు గాడి చిన్నతల్లి స్త్రీనిధి రుణాల్లోని కొంత సొమ్మును తన వ్యక్తిగత అవసరాలకు వాడుకుంది. రుణం డబ్బులు బ్యాంకుకు కట్టే సమయంలో తన స్నేహితురాలు, మృతురాలు మహేశ్వరి వద్ద అప్పుగా తీసుకొని అప్పుడప్పుడు బ్యాంకులో జమ చేసేది. తర్వాత కాలంలో మహిళా మండలి సభ్యుల నిధులను వీరిద్దరూ వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నారు. ఎన్నాళ్లు ఇలా చేస్తాం... నీవు వాడుకున్న డబ్బులు, నా దగ్గర అప్పుగా తీసుకున్న డబ్బులు తీసుకు రా.. నేను వాడుకున్న డబ్బులను తీసుకొచ్చి పూర్తి స్థాయిలో బ్యాంకు రుణాలను చెల్లించి హాయిగా ఉందామని చిన్నతల్లికి మృతురాలు మహేశ్వరి సూచించింది. దీంతో మహేశ్వరిని చంపేస్తే అప్పుగా తీసుకున్న డబ్బులతో పాటు స్త్రీనిధి రుణాలు కట్టాల్సిన అవసరం లేదని చిన్నతల్లి హత్య పథకం రచించింది. రేగ గ్రామానికి చెందిన తన ప్రియుడు డెంకాడ వాసుకు పథకాన్ని వివరించింది. ఇద్దరూ కలిసి ఈ నెల 17వ తేదీన మహేశ్వరిని కారులో ఎక్కించుకుని విజయగనరం మహిళా ప్రాంగణంలో సమావేశానికి బయలుదేరారు. జామి మండలం అలమండ సంత సమీపంలో టిఫిన్ చేశారు. అక్కడ నుంచి భీమసింగి బ్రిడ్జి కిందకు కారును తీసుకెళ్లి ఆపారు. అక్కడ కారు వెనుక సీటులో కూర్చున్న మహేశ్వరితో మాటలు కలిపి ఆమె చున్నీనే పీకకు బిగించి కారులోనే హతమార్చారు. అక్కడ నుంచి నిందితురాలు చిన్నతల్లి ఏమీ తెలియనట్టుగా విజయనగరం సమావేశానికి వెళ్లిపోగా, మృతదేహాన్ని కారులోనే పెట్టుకొని జమ్మాదేవిపేట గ్రామం సమీపంలోని సరస్వతీ లేవుట్ వద్ద గల నిర్మానుష్య ప్రాంతంలో తుప్పల్లో పడేసి డెంకాడ వాసు తన ఇంటికి వెళ్లిపోయాడు. మృతదేహం 18వ తేదీన ఉదయం వెలుగు చూసింది. పోలీసులు అన్నికోణాల్లో దర్యాప్తును ముమ్మరం చేశారు. ఫోన్ లోకేషన్స్, చిన్నతల్లి నడవడికపై నిఘా పెట్టగా చిన్నతల్లి, ఆమె ప్రియుడు డెంకాడ వాసు, మరో ప్రియుడు కోరాడ సాయికుమార్‌తో కలిసి దూరప్రాంతాలకు వెళ్లిపోయేందుకు బుధవారం సిద్ధమైన సమయంలో లక్కవరపుకోట మండలం గంగుబూడి కూడలి వద్ద ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారణ చేయగా నేరాన్ని అంగీకరించారు. నిందితులు ముగ్గురినీ కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జిముందు హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు డీఎస్పీ తెలిపారు.

దృశ్యం సినిమాను తలిపించిన కేసు..

మహేశ్వరి హత్యకేసును దర్యాప్తు చేసిన పోలీసులకు దృశ్యం సినిమా తలపించింది. నిందితురాలు గాడి చిన్నతల్లి తన స్నేహితురాలు మహేశ్వరి ఫోన్‌ను మాయం చేయడంతో పాటు లోకేషన్ దొరకుండా జాగ్రత్తలు పడింది. తన ప్రియుడు డెంకాడ వాసుతో కలిసి హత్యచేసి, మరో ప్రియుడు, కళ్లేపల్లికి చెందిన సాయికుమార్‌తో కలిసి పరారయ్యేందుకు ప్రయత్నించింది. ఆమెతో పాటు ఇద్దరు ప్రియుల ఫోన్‌లను వారివారి ఇళ్ల వద్దనే ఉంచేసి.. ఎవరికి ఎవరూ ఫోన్‌లు చేయకుండా గడిపారు. ఎప్పటివలే విజయనగరం సమావేశానికి చిన్నతల్లి హాజరుకావడం అంతా డ్రామాను తలపించింది. పోలీసులు సవాల్‌గా తీసుకుని కేసును దర్యాప్తు చేయడంతో నిందితులు పట్టుబడ్డారు. కేసు ఛేదనలో ప్రతిభ కనబర్చిన ఎల్.కోట, వేపాడ ఎస్‌ఐలు ముకుందరావు, రాజేష్, కానిస్టేబుల్స్ ఎం.రమేష్, పోతురాజు, గౌరినాయుడులను డీఎస్పీ గోవిందరావు అభినందించారు.

వెట్టిచాకిరీ చేయిస్తే కఠిన చర్యలు

- సీనియర్ సివిల్ జడ్జి కె.నాగమణి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కె.నాగమణి

విజయనగరం క్రైమ్: బాల, బాలికలతో వెట్టిచాకిరీ చేయిస్తే చట్ట ప్రకారం కఠినంగా శిక్షిస్తామని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.నాగమణి పేర్కొన్నారు. విజయనగరం చెంచుల కాలనీలో అంతర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం సందర్భంగా బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మానవ అక్రమ రవాణా నేరమని, పిల్లలను ఒకచోటు నుంచి వేరే ప్రాంతానికి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, వెట్టిచాకిరీ పనులకు తరలించరాదన్నారు. తహసీల్దార్ సీహెచ్ బంగార్రాజు మాట్లాడుతూ బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, పెద్దలు పనికి పోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకుని చిన్నారులను విద్యావంతులుగా తీర్చిదిద్దాలని కోరారు. వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు మాట్లాడుతూ పొరపాటున తల్లిదండ్రుల నుంచి తప్పిపోయిన బాలబాలికలను గుర్తించి కౌన్సెలింగ్ ద్వారా వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చుతున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ కె.వాసుదేవరావు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ జి.హిమబిందు, అయ్యన్నపేట కార్పొరేటర్ పైలాడ సత్యనారాయణ, ఏసీఎల్ శ్రీనివాసులు, రమాదేవి, శ్రీనివాసరావు, చంద్రశేఖర్, తాడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

పెదరావుపల్లిలో సర్వే



పెదరావుపల్లిలో సర్వే నిర్వహిస్తున్న విశాఖ జిల్లా సర్వే బృందం

కొత్తవలస: మండలంలోని పెదరావుపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో గల సుమారు 197 ఎకరాల భూమితో పాటూ గ్రామకంఠం కూడా సర్వే రికార్డుల్లో నమోదు కాలేదు. దీంతో మా గ్రామం విజయనగరం జిల్లాలోనూ లేదు. విశాఖపట్నం జిల్లాలోనూ చూపించలేదని చెబుతూ గ్రామస్తులు విశాఖపట్నం జిల్లా కేంద్రంలో జరిగిన కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండల సర్వేయర్ వడ్డి లీల పెదరావుపల్లి గ్రామంలో తన బృందంతో బుధవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెదరావుపల్లి గ్రామం విశాఖ, విజయగనరం జిల్లాల మధ్యలో ఉంది. ఈ గ్రామానికి చెందిన 197 ఎకరాల భూమితో పాటు 8 ఎకరాల్లో గల గ్రామకంఠాన్ని విశాఖ జిల్లా కొవ్వాడ గ్రామరెవెన్యూ పరిధిలో సర్వే నంబర్-1లో కొండపోరంబోకు భూమిగా రికార్డుల్లో నమోదై ఉన్నట్లు తెలిపారు. వాస్తవానికి ఈ భూమి పెదరావుపల్లి గ్రామానికి చెందిన రైతుల జిరాయితీ భూమి. ప్రస్తుతం ఆ భూముల్లో ఎన్నో సంవత్సరాలుగా వ్యవసాయం చేసుకుంటున్నారు. ఇక్కడి వాస్తవ పరిస్థితులను జిల్లా అధికారులకు నివేదిస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో కొవ్వాడ వీఆర్‌ఓ కనకమహాలక్ష్మి, కొవ్వాడ, పెదరావుపల్లి సచివాలయాల సర్వేయర్లు డి.సహిని, కె.కోటేశ్వరరావు, పెదరావుపల్లి ఎంపీటీసీ పరదేశినాయుడు, గ్రామపెద్దలు పెంట అప్పారావు, సర్పంచ్ పీతల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన కొండబాబు

బొండపల్లి: మండలంలోని ముద్దూరు గ్రామంలో ఒక ఇంట్లో గృహ నిర్మాణ పనులు చేస్తుండగా ఓ వ్యక్తి విద్యుత్ షాక్ తగిలి మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై ఎస్.రవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ముద్దూరు గ్రామంలో ఒక ఇంట్లో విద్యుత్ పనులు చేస్తూ గజపతినగరం మండలంలోని పురిటిపెంట గ్రామానికి చెందిన కలిశెట్టి కొండబాబు(35) మృతి చెందాడు. కొండబాబు విద్యుత్ పనులు చేస్తుండగా ఒక్కసారిగా షాక్‌కు గురి కావడంతో గజపతినగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స చేస్తుండగా మృతిచెందాడు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించిన అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

మిల్లు ఆపరేటర్..

రాజాం సిటీ: మండల పరిధి ఒమ్మి పంచాయతీ నర్సింహపురంలోని జయలక్ష్మి మోడరన్ రైస్ మిల్లు పక్కన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై మిల్లు ఆపరేటర్ మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై వీబీ రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక నవ్యనగర్‌లో నివాసం ఉంటున్న గుమ్మలక్ష్మీపురం మండలం పెద్దలేవిడి గ్రామానికి చెందిన కొండగొర్రి వెంకటరావు (55) రైస్ మిల్లులో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం యథావిధిగా విధులకు హాజరయ్యాడు. మిల్లుకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సమస్య ఉందని తెలుసుకుని అక్కడికి వెళ్లి చూశాడు. అక్కడ విద్యుత్ సరఫరా ఉన్న ఎంసీబీకి తగలడంతో షాక్ కొట్టి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మిల్లు యజమాని బూరాడ విజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించామన్నారు. మృతునికి భార్య జయలక్ష్మితో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మామిడి తోటలో వ్యక్తి..

భోగాపురం: మండలం కేంద్రం భోగాపురం నుంచి అక్కివరం వెళ్లే దారిలో ఉన్న మామిడి తోటలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డెంకాడ మండలం అక్కివరం గ్రామానికి చెందిన పెంటబోయిన ఆదినారాయణ(47)మామిడి తోటలో ఉన్న కాయలను దింపేందుకు వెళ్లి చెట్టుకొమ్మ విరిగి పడిపోయి మృతిచెందినట్లు భావిస్తున్నారు. అయితే తోటకాపరి గిన్నె సత్యం, ఆదినారాయణ రెండేళ్లుగా మంచి స్నేహితులు. ఆదినారాయణ తన పశువులను ఇక్కడే మేపుతుంటాడు. ఈ క్రమంలో కాపరి సత్యం మాట్లాడుతూ తాను ఆ సమయంలో లేనని తోటలో కాయల్ని తీసుకెళ్లాలని ఆదినారాయణ మృతి విషయాన్ని తోట గుమస్తా జగదీష్‌కు తెలియజేయగా మృతుని కుటుంబసభ్యులకు సమాచారం అందించారని తెలిపాడు. ఈ సమాచారం మేరకు కుటుంబ సభ్యులు వచ్చి ఆదినారాయణను స్థానిక సుందరపేట ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇదిలా ఉండగా తన తండ్రి మృతిపై అనుమానం ఉందని, కేవలం చెట్టుపై నుంచి పడిపోవడం కాదని, కావాలనే తన తండ్రిని హత్యచేసి ఉంటారంటూ మృతుడి కుమారుడు రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

అరకు-విశాఖ రోడ్డు నిర్మాణ స్థలం పరిశీలన

కొత్తవలస: అరకు-విశాఖ జాతీయ రహదారి (516-బి) రోడ్డు నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఆర్డీఓ ఎం.సూర్యకళ నేషనల్ హైవే అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. కొత్తవలస మండ లం చింతలపాలెం, వీరభద్రపురం గ్రామాల్లో పర్యటించారు. వీరభద్రపురం గ్రామం మీదుగా ఇప్పటి కే సుజలస్రవంతి పోలవరం ఎడమ కాలువ, రాయపూర్ గ్రీన్‌ఫీల్డు హైవే, రైల్వేలైన్, ఐఓసీఎల్ పైప్‌లైన్ తదితర ప్రాజెక్టులన్నీ వెళ్తున్నాయని, 90 శాతానికి పైగా సాగుభూమి కోల్పోయామని, ఇప్పుడు ఈ హైవే వస్తే పూర్తిగా భూములు కోల్పోవాల్సి వస్తుందని గ్రామ రైతులు వాపోయారు. దీనిపై ఆర్డీఓ స్పందిస్తూ పరిహారంపెంచి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం చేసిన నిందితుడి అరెస్టు

రాజాం సిటీ: ఇటీవల రేగిడి మండలం సంకిలి సుగర్‌ఫ్యాక్టరీ వద్ద హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేశామని రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక రూరల్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి ఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ నెల 21న సంకిలి సుగర్ ఫ్యాక్టరీ వద్ద సంకిలి గ్రామానికి చెందిన కర్రి రమణపై పాలకొండకు చెందిన లక్ష్మీనారాయణ కత్తితో దాడిచేసి గాయపరిచాడు. రమణ మెటీరియల్ సప్‌లెర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. పాలకొండకు చెందిన తిరుమల కన్‌స్ట్రక్షన్ సూపర్‌వైజర్‌గా లక్ష్మీనారాయణ పనిచేస్తున్నాడు. తిరుమల కన్‌స్ట్రక్షన్స్ యాజమాన్యం రమణకు రూ.4.70 లక్షలు బకాయి పడింది. దీంతో తన నగదు చెల్లించాలని సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణను రమణ అడగడంతో దాడిచేసి గాయపర్చి పరారయ్యాడు. ఈ క్రమంలో ఎస్సై ఇ.శ్రీనివాస్ సిబ్బంది, పాలకొండ మండలం బూరాడ జంక్షన్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఆర్థిక లావాదేవీలతోనే ఈ ఘటన జరిగిందని సీఐ తెలిపారు. ఈ మేరకు నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామన్నారు. సమావేశంలో ఎస్సై ఇ.శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

గిరిజన విద్యార్థి ఆత్మహత్య



హేమంత్ కుమార్ మృతదేహం

పాచిపెంట: అగ్రికల్చర్ డిప్లమోలో ఫెయిల్ అవడంతో తల్లిదండ్రులు మందలిస్తారన్న భయంతో పురుగుమందు తాగి గిరిజన విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని అమ్మ వలసలో జరిగిన ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన జట్ల హేమంత్ కుమార్ నెలిపర్తిలో అగ్రికల్చర్ డిప్లమో ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు, ప్రథమ సంవత్సరం పరీక్షల్లో ఫెయిల్ అవడంతో తల్లిదండ్రులు మందలిస్తారని భయాందోళన చెంది మంగళవారం 11 గంటల సమయంలో ఊరు బయట ఉన్న చెరువు వద్దకు వెళ్లి పురుగుమందు తాగేశాడు. బయటికి వెళ్లిన తన అన్న ఇంకా ఇంటికి రాలేదని తమ్ముడు హేమకుమార్ చెరువు వద్దకు వెళ్లి చూడగా అపస్మారస్థితిలో ఉన్న అన్నను చూసి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చాడు, వెంటనే సాలూరు సీహెచ్‌సీకి తీసుకువెళ్లగా ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం నిమిత్తం విజయనగరం కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మరణించాడు, మృతుడి తండ్రి జట్ల రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటరమణ పేర్కొన్నారు.

చెట్టుకొమ్మ తలపై పడి వ్యక్తికి తలకు గాయం

వేపాడ: మండలకేంద్రం వేపాడకు చెందిన ఈగల అప్పారావుపై చెట్టు కొమ్మ విరిగి తలపై పడిపోవడంతో తలకు గాయమైంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం సాయంత్రం మేకలను మేపుకుని ఇంటికి వస్తున్న సమయంలో వీచిన ఈదురు గాలులకు వల్లంపూడి సమీపంలో కళ్లాల వద్ద చెట్టు కొమ్మ విరిగి అప్పారావు తలపై పడిపోవడంతో కుడిపక్క గాయమైంది. దీంతో అప్పారావు గ్రామంలోకి చేరుకోగానే కుటుంబసభ్యులు 108లో ఎస్.కోట ఆస్పత్రికి హుటాహుటిన తరలించారు. మార్గంలోనే 108 ఈఎంటీ టీపీవీ రమణనాయుడు తలకు రక్తస్రావం అవకుండా కట్టువేసి సెలైన్ బాటిల్ పెట్టి ఎస్.కోట ఆస్పత్రికి తరలించారు.

బస్సు టైర్లు ఎక్కి ప్రయాణికురాలికి..



ప్రమాదస్థలం వద్ద ఉన్న క్షతగాత్రురాలు

సాలూరు: ప్రయాణికురాలి కాళ్ల మీద నుంచి బస్సు టైర్లు ఎక్కడంతో తీవ్ర గాయాల పాలైంది. ఈ మేరకు పట్టణ ఎస్సై నారాయణ తెలిపిన వివరాలు ప్రకారం, పాచిపెంట మండలం పాంచాలి గ్రామానికి చెందిన కె.చిన్నతల్లి బుధవారం పట్టణంలోని మెయిన్‌రోడ్డులో గల బస్టాండ్ వద్ద పార్వతీపురం బస్సు ఎక్కుతుండగా, డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఆమె కింద పడిపోయింది. దీంతో ఆమె రెండు కాళ్ల మీదకు బస్సు వెనుక టైర్లు ఎక్కడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆమెను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్, ఆటో ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలు



గాయాల పాలైన పైడిరాజు, అనురాధ, శ్యాం

జామి: ట్రాక్టర్, ఆటో ఢీకొన్న ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జామి మండలం చింతాడ గ్రామానికి చెందిన దేగల పైడిరాజు, కుమార్తె అనూరాధ, కుమారుడు శ్యాం అన్నంరాజుపేట పండగకు వెళ్లి బుధవారం రాత్రి తిరిగి స్వగ్రామం చింతాడకు ఆటోలో వస్తుండగా జాగరం నుంచి జామి వెళ్తున్న ట్రాక్టర్ జాగరం గ్రామం వద్ద ఆటోను ఢీకొంది. దీంతో ప్రమాదంలో ముగ్గురికీ తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బస్సులో బంగారం గొలుసు చోరీ



బస్సులో తనిఖీలు చేస్తున్న పోలీసులు

రణస్థలం: విజయనగరం నుంచి శ్రీకాకుళం వస్తున్న ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళ మెడలో మూడు తులాల బంగారం గొలుసు చోరీకి గురైనట్లు ఫిర్యాదు అందిందని జె.ఆర్.పురం పోలీసులు తెలిపారు. ఎచ్చెర్ల మండలం ఇబ్రహీంబాద్ గ్రామానికి చెందిన గరుగుబెల్లి అనితతో సహా మరో ముగ్గురు మహిళలు విజయనగరంలోని బంధువుల ఇంటిలో జరిగిన వారాల పండగకు బుధవారం ఉదయం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో విజయనగరం నుంచి వస్తున్నప్పుడు గుర్తు తెలియని మహిళ అనిత మెడలో నుంచి గొలుసును చాకచక్యంగా చోరీ చేసింది. అయితే ఈ విషయాన్ని ఆమె పూసపాటిరేగ మండలంలోని కందివలస వచ్చిన తరువాత గమనించింది. వెంటనే 100కు ఫోన్ చేయడంతో జె.ఆర్.పురం పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో రణస్థలంలో బస్సు ఆపి మహిళా పోలీసులు తనిఖీ నిర్వహించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. చోరీకి పాల్పడినట్లు భావిస్తున్న మహిళ కందివలసలో దిగిపోయిందని బస్సులో ఉన్న ప్రయాణికులు తెలిపారు. దీనిపై జె.ఆర్.పురం ఎస్సై రాజేష్ మాట్లాడుతూ.. విజయనగరం, పూసపాటిరేగ సమీపంలో చోరీ జరిగిందని, ఫిర్యాదు స్వీకరించి రెండు పోలీస్‌స్టేషన్లకు సమాచారం ఇచ్చి దర్యాప్తు చేస్తామని చెప్పారు.

షూటింగ్ సందడి



రింగ్‌రోడ్డులోని ఓ షాప్‌లో సినీ చిత్రీకరణలో పాల్గొన్న హీరో సంపూర్ణేష్‌బాబు, హీరోయిన్ అంతర

విజయనగరం టౌన్: రాజ్‌కుమార్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న కొత్త చిత్రంలోని పలు సన్నివేశాలను విజయనగరం జిల్లా కేంద్రంలోని రింగ్‌రోడ్డు లీపారడైజ్, పెద్దచెరువు గట్టు సమీపంలోని ఆస్పత్రి ఆవరణలో బుధవారం చిత్రీకరించారు. సినిమాలో సంపూర్ణేష్‌బాబు హీరోగా, అంతర స్వర్ణక హీరోయిన్‌గా నటిస్తున్నట్టు నిర్మాత రాజ్‌కుమార్ చందక తెలిపారు. ఓ తల్లికి జరిగిన అన్యాయం రూపొందుతున్న చిత్రం షూటింగ్ మరో రెండు రోజుల్లో పూర్తవుతుందన్నారు. ఉత్తరాంధ్రాలో లొకేషన్‌లు బాగా ఉండడంతో చిత్రపరిశ్రమ ఇటువైపు మొగ్గుచూపుతోందన్నారు. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు శ్రీనివాస్, వెంకట్‌లు నిర్వర్తిస్తున్నారన్నారు. చిత్రంలో అమిత్ తివారీ, రాజీవ్ కనకాల తదితరులు నటిస్తున్నారని తెలిపారు.

చేపల వేట



వంగర మండల సమీపంలో ఉన్న రావి చెరువులో స్థానికులు బుధవారం చేపలవేట సాగించారు. చెరువులో నీరు పూర్తిగా తగ్గుముఖం పట్టడంతో గుంపుగా చేపల వేట చేశారు. కొందరికి పెద్ద ఎత్తున చేపలు దొరకడంతో సంతోషపడ్డారు. -వంగర